
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 4 జూలై 2024

విప్లవజ్యోతి అల్లూరి

- బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సీతారామరాజు
- ఆదివాసీలపై బ్రిటీష్ అధికారుల అకృత్యాలు
- లంబసింగి ఘాట్ నిర్మాణంలో తక్కువ కూలి ఇచ్చి చిత్రహింసలు
- ఆదివాసీల కోసం విప్లవ వీరుడి అలుపెరగని పోరాటం

చింతపల్లి, జూలై 3:

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు.. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ధీశాలి.. అల్లూరి సీతారామరాజు. స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి సాయుధ పోరాటం ఓ చరిత్ర సృష్టించింది. పిన్నవయస్సులో బ్రిటీష్ పాలకుల అకృత్యాలు, దురాగతాలను ఎదురించి, ఆదివాసీలను చైతన్యం చేసి రంప తిరుగుబాటుకు శ్రీకారం చుట్టిన సీతారామరాజు రెండేళ్ల పోరాటంలో బ్రిటీష్ పాలకులకు కంటి మీద కునుకులేకుండా చేశాడు. సకల విద్యాపారంగతుడైన అల్లూరి సీతారామరాజు ప్రజల కోసమే జీవించారు. వారి కోసమే ప్రాణత్యాగం చేశారు. ఆ మహనీయుని 127వ జయంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సీతారామరాజు సమాధి



పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు జన్మించిన ఇల్లు



అల్లూరి సీతారామరాజు దాడి చేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్

అల్లూరి సీతారామరాజు అసలు పేరు శ్రీరామరాజు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలోని అమ్మమ్మ ఇంట శ్రీరామరాజు జన్మించాడు. శ్రీరామరాజు తండ్రి అల్లూరి వెంకటరామరాజుది పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు. ఆయన ఫొటోగ్రాఫర్, గ్రామంలో ఫొటో స్టూడియో నడిపేవారు. 1890లో ఆయన అనకాపల్లి వచ్చి కొంతకాలం ఉన్నారు. అదే సమయంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ నుంచి బతుకుతెరువు కోసం పద్మనాభం మండలం పాండ్రంగికి వలస వచ్చిన స్థిరపడిన వెంకటరామరాజు కుమార్తె సూర్యనారాయణమ్మతో వివాహం నిశ్చయమైంది. అల్లూరి వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మల వివాహం 1895లో జరిగింది. మొదటి కాన్పు కోసం సూర్యనారాయణమ్మ 1896 ఆఖరిలో పుట్టింటికి వచ్చింది. 1897 జూలై 4వ తేదీ సాయంత్రం సుమారు 4:10 గంటలకు పాండ్రంగిలో శ్రీరామరాజు(సీతారామరాజు) జన్మించాడు. శ్రీరామరాజుకి ఏడాది వయస్సు వచ్చాక వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులు స్వగ్రామం మోగల్లు వెళ్లిపోయారు. వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మలకు 1901లో కుమార్తె సీతమ్మ, 1906లో రెండోవ కుమారుడు సూర్యనారాయణరాజు జన్మించాడు.

నేడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా..



చిన్నవయస్సులో సీతారామరాజు (ఫైల్)

కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సీతారామరాజు విగ్రహం

కలరాతో తండ్రి మృతి

సీతారామరాజు తండ్రి రామరాజు రాజమండ్రిలో స్థిరపడి, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. 1908లో గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రబలిన కలరా వ్యాధికి గురై వెంకటరామరాజు మరణించారు. సీతారామరాజు ఆరవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రిని కోల్పోవడంతో ఆయన జీవితంలో పెనుమార్పు వచ్చింది. స్థిరాదాయంలేక, పేదరికం వల్ల రాజు కుటుంబం స్థిరంగా ఒకచోట ఉండలేక వివిధ ప్రదేశాలకు వెళ్లి నివసించాల్సి వచ్చింది. దీంతో తండ్రి మరణం సీతారామరాజు విద్యపై తీవ్ర ప్రభావం చూపింది.

తొలి స్థావరం కృష్ణాదేవిపేట..

సీతారామరాజు తొలి స్థావరం కృష్ణాదేవిపేటగా ఏర్పర్చుకున్నాడు. కృష్ణాదేవిపేటలో చిటికెల భాస్కర నాయుడు ఆశ్రయం కల్పించాడు. 1917లో స్నేహితుడు పేరిచర్ల సూర్యనారాయణతో కలిసి కాషాయ వస్త్రాలు ధరించి కృష్ణాదేవిపేటలో నీలకంఠేశ్వరుని ఆలయంలో మకాం పెట్టాడు. అక్కడ ఉంటూనే ఆదివాసీలపై బ్రిటీష్ పాలకుల దురాగతాలు, అకృత్యాలను తెలుసుకుని రగిలిపోయాడు. అదే సమయంలో బ్రిటీష్ పాలకులపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆదివాసీలకు కూలి చెల్లింపులో అన్యాయంపై లేఖ

లంబసింగి ఘాట్ రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న గిరిజనులకు చెల్లించే కూలీలో చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అన్యాయం చేయడంపై బ్రిటీష్ పాలకులకు సీతారామరాజు లేఖ రాశాడు. చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అత్యంత క్రూరుడు. నర్సీపట్నం నుంచి లంబసింగి ... మిగతా 6వ పేజీలో



పార్వతీనగర్ గిరిజనుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

మిషన్ కనెక్ట్ పాడేరును కొనసాగిస్తాం

- జిల్లాలో 938 మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ లేదు
- గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ దినేశ్‌కుమార్

సీలేరు, జూలై 3:

జిల్లాలో ప్రస్తుతం 938 మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ లేదని, గతంలో అమలు చేసిన మిషన్ కనెక్ట్ పాడేరు కార్యక్రమాన్ని పునఃప్రారంభించి పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన జీకేవీధి మండలం సీలేరులో పర్యటించారు. ఈ సందర్భంగా జెన్‌కో అతిథి గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు కనెక్టివిటీ చాలా ముఖ్యమని, దీనిపై దృష్టి సారించామన్నారు. గతంలో మంజూరై నిలిచిపోయిన ప్రత్యేక జనరల్ నిధులపై కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఆ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. మలేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు డిమాండ్ ఎక్కువగా ఉందని, దీని సీట్ల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. అలాగే పాడేరులో మరో రెండు రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

సీలేరులో కొత్తగా నిర్మించే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై స్థానిక జెన్‌కో అధికారులతో చర్చించామన్నారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంపై స్థానికుల నుంచి, పార్వతీనగర్ గిరిజనుల నుంచి తమకు అందిన ఫిర్యాదులపై జెన్‌కో అధికారులతో చర్చించామని ఆయన తెలిపారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అంశం, సీలేరులో 60 సంవత్సరాల క్రితం నివాసం కోసం జెన్‌కో మంజూరు చేసిన స్థలాల్లో ఇప్పుడు ఎవరైతే ఉంటున్నారో వారి పేరునే అలాట్‌మెంట్ ఇప్పించమని జీకేవీధి తహసీల్దార్, జెన్‌కో అధికారులను ఆదేశించినట్టు ఆయన చెప్పారు. ఆర్వీనగర్ నుంచి నూతిబంద వరకు అధ్వానంగా ఉన్న రహదారిని స్వయంగా పరిశీలించామని, ఈ రహదారికి అవసరమైన ప్రతిపాదనలను, అంచనాలను తయారు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించామన్నారు.

అంతకుముందు సీలేరు కాంప్లెక్సులోని విద్యుత్ ఉత్పత్తి, సామర్థ్యం, గోదావరి డెల్టాకు నీటి విడుదల తదితర అంశాలపై స్థానిక జెన్‌కో అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు కేకేవీ ప్రశాంత్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి (పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు) ఈఈ ప్రభాకరరావు, ఏడీఈ వెంకటమధు, ఏఈఈ సురేశ్, ఎండీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ దుర్గో, తదితరులు పాల్గొన్నారు.

వంజంగి హిల్స్‌కు రూ.2.5 కోట్లతో రహదారి

ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వెల్లడి

పాడేరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సందర్శనీయ ప్రాంతం వంజంగి హిల్స్‌కు రూ. 2.5 కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మాణం చేపడతామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బుధవారం ఆయన వంజంగి హిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మూడున్నర కిలోమీటర్ల మట్టి రోడ్డును రానున్న ఆరు నెలల్లో తారురోడ్డుగా నిర్మిస్తామన్నారు. నాణ్యతగా తారురోడ్డును నిర్మించాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను పీవో ఆదేశించారు. వ్యూపాయింట్ వద్ద ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, సందర్శకుల సౌకర్యార్థం తాగునీరు, కంటైనర్ మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. ఆయా పనులు చేపడుతున్న క్రమంలో పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సందర్శకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయా పనులను వేగవంతం చేసి రానున్న పర్యాటక సీజన్ నాటికి వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం.రాజు, డీఈఈ పి.అనుదీప్, ఎంపీడీవో సాయినవీన్, తదితరులు పాల్గొన్నారు.



వంజంగి కొండపై రోడ్డును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సాధికారత సంస్థ డీఎం ఎల్.భాస్కరరావు

పసుపు రైతుల ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

రైతు సాధికారత సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు

పాడేరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పసుపును సాగు చేస్తున్న గిరిజన రైతుల ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడతామని రైతు సాధికారత సంస్థ(ప్రకృతి వ్యవసాయం) జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు తెలిపారు. హుకుంపేటలో పసుపులో అధిక దిగుబడిపై ఉద్యానవన శాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన రైతులు సంపూర్ణ సేంద్రీయ పద్ధతులను అనుసరిస్తున్నప్పటికీ, ఆధునిక సేద్యపు పద్ధతలను పాటించకపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించలేకపోతున్నారని చెప్పారు. గిరిజన రైతులకు పసుపు సాగులో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. రైతులు కాస్త శ్రద్ధకనబరిస్తే దిగుబడులు పెరిగి ఆదాయం సైతం రెట్టింపు అవుతుందన్నారు. అందుకు అవసరమైన చర్యలను చేపట్టి, పసుపు రైతులను చైతన్యం చేస్తామని తెలిపారు. పసుపునకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చిట్టిబాబు, చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ప్రదీప్.. పసుపు రైతులు చేపడుతున్న సాగు విధానం, మెరుగ్గా పాటించాల్సిన పద్ధతులను వివరించారు. రైతులు ఎంతో కష్టపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడులు, ఆదాయం రావడం లేదన్నారు. దానిని అధిగమించేందుకు కృషి చేస్తామని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ కల్యాణి, కేవీకే సమన్వయకర్త రాజ్‌కుమార్, డిజిటల్ గ్రీస్ సంస్థ ప్రతినిధి శ్రీకాంత్, ఉద్యానవనాధికారులు, రైతులు, ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కాలువపై కొత్తబంద గిరిజనులు నిర్మించిన కర్రల వంతెన

స్కూల్‌కు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే..

- కాలువపై కర్రల వంతెన ఏర్పాటు చేసిన గిరిజనులు
- దాన్ని దాటి బాలల రాకపోకలు

చింతపల్లి, జూలై 3: మండలంలోని కొత్తబంద గ్రామంలోని సుమారు 20 మంది విద్యార్థిని, విద్యార్థులు పొట్టిబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. వీరంతా స్కూల్‌కు వెళ్లాలంటే కాలువ దాటి వెళ్లాలి. అయితే వర్షాలు కురిస్తే ఈ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను కాలువ దాటిస్తుంటారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గ్రామస్థులు శ్రమదానం చేసి కాలువపై కర్రలతో వంతెన నిర్మించారు. దాని మీదుగానే పిల్లలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే దీనిపై వెళ్లేటప్పుడు పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై శాశ్వతంగా వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముమ్మరంగా రాగుల సాగు

- మెట్ట, కొండ ప్రాంతాల్లో జోరుగా నాట్లు
- ఏజెన్సీ వ్యాప్తంగా 28 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట
- గిరిజన ప్రాంతంలో వరి తరువాత స్థానం రాగులదే..

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో చోడి(రాగులు) నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఏజెన్సీలో వరి సాగు తరువాత చోడి సాగుకే గిరిజనులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. దీంతో ఏ గిరిజన పల్లెల్లో చూసినా చోడి నాట్లు వేస్తున్న గిరిజనులే కనిపిస్తున్నారు.

ఏజెన్సీ వ్యాప్తంగా ఖరీఫ్‌లో సుమారుగా 46 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేయగా, సుమారుగా 28 వేల హెక్టార్లలో చోడి పంటను పండిస్తుంటారు. చోడిని ప్రధాన ఆహార పంటగా గిరిజనులు సాగు చేస్తుంటారు. సాగునీటి సదుపాయం ఉన్న పల్లపు ప్రాంతాల్లో వరిని పండిస్తే, కాస్త మెట్ట, కొండ ప్రాంతాల్లో చోడిని వేస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమి మెత్తబడడంతో గిరిజనులు తొలి దుక్కి పనులు పూర్తి చేసి, చోడి నాట్లు వేస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నీటి తడి ఎక్కువ అవసరం లేని ప్రాంతాల్లో సైతం చోడి పండుతుంది. దీంతో గిరిజనులు తమ గ్రామాలకు చేరువగా ఉన్న మెట్ట, కొండ ప్రాంతాల్లో చోడి సాగు చేస్తున్నారు. చోడిని పండించి, వాటిని పిండి చేసుకుని ఏడాదంతా గిరిజనులు నిల్వ చేసుకుంటారు. ఆ పిండితో జావ(అంబలి)చేసుకుని ప్రతి రోజు ఆహారంగా తీసుకుంటారు. తక్కువ ఖర్చుతో ఆహారం సమకూరడంతో పాటు చోడిలో పిండి పదార్థాలు, ఇనుము, తదితర పోషక విలువలు ఉండడంతో గిరిజనులకు ఆరోగ్యపరంగా అది ఎంతో ఉపయోగపడుతుంది.



హుకుంపేట మండలం మారెల గ్రామంలో చోడి నాట్లు వేస్తున్న గిరి రైతులు



చోడి నారుతీత పనిలో గిరిజన మహిళలు

విభిన్నంగా చోడి నాట్లు

గిరిజనులు చోడి నాట్లు వేసే విధానం సైతం విభిన్నంగా ఉంటుంది. ఎక్కడైనా భూమిని దున్నేసి, చక్కగా దమ్ముపట్టి నాట్లు వేయడం చూస్తుంటాం. కానీ గిరిజనులు అందుకు భిన్నంగా చోడి నాట్లు వేస్తారు. పంట భూమిని తొలుత మెత్తగా దున్నేస్తారు. దుక్కి పనులు పూర్తయ్యే నాటికి చోడి నారును సిద్ధం చేసుకుంటారు. ఇంటిల్లపాది పంట భూమి వద్దకు చేరుకుని పురుషులు వ్యవసాయ పని ముట్లతో పాయగా చేసి, ఆ పాయలో నాట్లు వేసి మట్టితో కప్పేస్తుంటారు. మహిళలు మడిలోని నారు తీసి నాట్లు వేసే ప్రదేశానికి తీసుకువస్తారు. ఇలా గిరిజనులు సంప్రదాయబద్ధంగా చోడి నాట్లు వేస్తుంటారు.

సాగుకు కానరాని ప్రత్యేక సాయం

ఏజెన్సీలో రాగులు సాగు చేసే గిరిజన రైతులకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఎటువంటి ప్రత్యేక సాయం చేయకపోయినా గిరిజనులు మాత్రం తాము పండించిన పంట నుంచే కొంత మేరకు విత్తనాలు సమకూర్చుకుని, వాటిని పొదుపు చేసుకుని చోడి సాగును ప్రతి ఏడాది చేపడుతున్నారు. చిరు ధాన్యాల జాబితాలో ఉన్న చోడి పంటకు ప్రభుత్వపరంగా ప్రత్యేక సాయం అందించడంతో పాటు ఆ పంట అంతరించిపోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే ఎటువంటి ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించకుండా సంప్రదాయబద్ధంగా, సేంద్రియ విధానంలో సాగు చేసే చోడి పంటను ఏజెన్సీలో మరింతగా అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

ఎఫ్‌పీవోల ప్రగతికి సహకారం

రైతులు నాణ్యమైన దిగుబడి సాధించేందుకు కాఫీ బోర్డు కృషి

గౌహతి జాయింట్ డైరెక్టర్ నవీన్‌కుమార్

-వార్త 6వ పేజీలో...

క్రైం... crime news

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.1.5 లక్షల వసూలు

▸ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 3 : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకోని మోసం చేశారంటూ వజ్రగడ గ్రామానికి చెందిన వంటాకుల రామలక్ష్మి స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. వజ్రగడ గ్రామానికి చెందిన తమరాన యర్రన్ననాయుడు స్మార్ట్ విలే జ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి మోసం చేశారని రామలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకోసం తన వద్ద లక్షా 50 వేల రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు తీసుకున్న డబ్బులు అడిగితే డబ్బులు ఇచ్చేది లేదని అంటున్నాడని, బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఆమె పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

బాలకార్మికులతో పనులు చేయించిన యజమానులపై కేసులు

చోడవరం, జూలై 3 : బాల కార్మికులను దుకాణాలలో పనిలో పెట్టుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నట్టు స్థానిక సహాయ కార్మిక అధికారి పి.సత్యానారాయణ తెలిపారు. చోడవరం కార్మికశాఖ పరిధిలోని దేవరాపల్లి, పాడేరు, సబ్బవరం ప్రాంతాల్లో బాలకార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి పనులు చేయిస్తున్న దుకాణాల యజమానులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఆ ముగ్గురు కార్మికులకు న్యాయంగా రావలసిన వేతనాల వ్యత్యాసాన్ని ఆ దుకాణాల యజమానుల నుంచి వసూలు చేసి, తిరిగి ఆయా కార్మికులకు చెల్లించినట్టు తెలిపారు. ఈ విధంగా రూ.24,920లు కార్మికులకు అందజేసినట్టు తెలిపారు. అలాగే కార్మికులను తక్కువ వేతనాలతో పనులు చేయించే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ హెచ్చరించారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి జరిమానా


వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 3 : మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు జడ్జి బీవీ విజయలక్ష్మి తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.పైడపునాయుడు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 28 మంది పట్టుబడ్డారు. వీరిని 13వ ఎంఎం కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి పైవిధంగా జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన ద్విచక్ర వాహనదారులు 21 మందిపై కేసులు నమోదు చేసి రూ.9,335 జరిమానా విధించారన్నారు. అనంతరం ఆయన పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను అంతా విధిగా పాటించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి

మాకవరపాలెం, జూలై 3 : తామరం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

కొత్తపాలెం గ్రామానికి ఏకా సత్తిబాబు (40) బుధవారం సాయంత్రం మాకవరపాలెం గ్రామానికి బైకుపై అతనితో పాటు ఇద్దరు పిల్లలను తీసుకొని బయలుదేరారు. కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా తామరం పెట్రోల్ బంకు వద్ద బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వ్యానును ఢీ కొంది. దీంతో అతను రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయం తగిలింది, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అతనితో పాటు ఉన్న ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.


సత్తిబాబు (ఫైల్)

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

కశింకోట జూలై 3 : కశింకోటలోని భవానీ కాలనీకి చెందిన శిష్టి పరమేశ్వరరావు (48) అప్పుల బాధ తాళలేక ఆయన నివాసంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పరమేశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు అతని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు.

పలు రైళ్లు రద్దు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 3 : పలాస, విజయనగరం మెయిన్‌లైనులో భద్రత పనులు చేపడుతుండడంతోపలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

ఈనెల 5న పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), గుణుపూర్-విశాఖ (085 21), విశాఖ- గుణుపూర్ (08522), విశాఖ-భవానీపట్న (08504), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820) రద్దు చేశారు. అలాగే, ఈనెల 6న భవానీపట్న- విశాఖ (08503), బ్రహ్మపూర్ - విశాఖ (08531), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ (22819) రద్దు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఈనెల 5న భువనేశ్వర్ - రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ (20896) రెండున్నర గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) గంటన్నర, సంబల్‌పూర్ - నాందేడ్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20809) రెండు గంటలు, సంత్రాగచ్చి - తంబరం ఎక్స్‌ప్రెస్ (16090) మూడున్నర గంటలు, విశాఖ - విజయనగరం మెము (07468) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి. అలాగే, ఈనెల 4న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) మూడున్నర గంటలు ఆలస్యంగా వెళ్లనుంది.

సెజ్‌లో కొత్తగా ఏఐ పరికరాల తయారీ కంపెనీ

▸ 'స్మైల్' పేరిట 20 ఎకరాలలో నిర్మాణం

▸ 2028వ సంవత్సరంలో ప్రారంభం

అచ్యుతాపురం రూరల్, జూలై 3 : ఇక్కడి ఎస్ఈజెడ్ పరిధిలో నూతనంగా ఏఐ ఉత్పత్తుల తయారీ, విదేశీ ఎగమతుల కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల సెజ్‌లో సబ్ స్టాక్ట్ మ్యానుఫ్యాక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంటర్‌ప్రైజెస్ (స్మైల్) పేరుతో ఏపీఐఐసీ ఇప్పటికే ఇరవై ఎకరాల భూమిని కేటాయించింది. చండీఘర్‌కు చెందిన ఈ కంపెనీ యాజమాన్యం సెజ్‌లో రూ.189 కోట్ల పెట్టుబడితో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) పరికరాలతయారీ, విదేశీ ఎగుమతులు చేయనున్నారు. వచ్చే 2028 వ సంవత్సరంలోగా కంపెనీ ప్రారంభమై, సుమారు ఐదు వేల మందికి ఉపాధి కల్పించనుందని సంస్థ ప్రతినిధులు ఏపీఐఐసీకి నివేదిక ద్వారా తెలియజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

కృష్ణాదేవిపేట పార్కులో అల్లూరి జయంతి ఏర్పాట్లు


అల్లూరి పార్కులో పనులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో హెచ్‌వీ జయరాం


పార్కులో ముగ్గులు వేస్తున్న వెలుగు అధికారులు, సిబ్బంది

కృష్ణాదేవిపేట, జూలై 3 : కృష్ణాదేవిపేట సమీపంలోని అల్లూరి స్మృతివనంలో గురువారం అల్లూరి జయంత్సోవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి కూలీలతో పిచ్చి మొక్కలు తొలగించారు. వెలుగు అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళలు ముగ్గులు వేశారు. అల్లూరి జయంతి ఉత్సవాలకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. అందులో భాగంగా బుధవారం నర్సీపట్నం ఆర్‌డీవో హెచ్‌వీ జయరాం, గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తదితరులు జయంతి సభావేదిక పనులు పరిశీలించారు. అలాగే పార్కులో అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి చరిత్ర కళామందిరాన్ని శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజ్‌భరత్, వెలుగు ఏపీఎం మంగ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు, అధికారులు అల్లూరి యువజన సంఘం నాయకులు శ్యామల వరలక్ష్మి, లాక్కాకులు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సాయుధ పోరాటానికి సజీవ సాక్ష్యం

బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు

▸ అల్లూరి అనుచరుల చేతిలో మృతి చెందిన హైటర్, కవర్ట్‌లు

▸ 1922, సెప్టెంబరు 24న దామనాపల్లి ఘాట్‌లో ఘటన

▸ మృతదేహాలను నర్సీపట్నం తరలించి ఖననం చేసిన బ్రిటీష్ ప్రభుత్వం

▸ 46 సెంట్లు సమాధులు ప్రాంతాన్ని నిషిద్ధ భూమిగా ప్రకటించిన బ్రిటీష్ ప్రభుత్వం

▸ నేడు అల్లూరి సీతారామరాజు జయంతి

నర్సీపట్నం, జూలై 3 : బ్రిటీష్ ప్రభుత్వంపై మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటానికి సజీవ సాక్ష్యంగా నర్సీపట్నంలోని బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు నిలుస్తున్నాయి. నేటి తరానికి అల్లూరి సాయుధ పోరాటం గురించి తెలియాలంటే ఈ బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు తప్పితే ఇతర ఏ విధమైన ఆధారాలు లేవు. ఇద్దరు బ్రిటీష్ సైనికాధికారులు అల్లూరి అనుచరుల చేతితో మృతి చెందినట్టు పక్కాగా ప్రభుత్వ రికార్డుల్లో కూడా ఉంది. ఈ కారణం వల్లే చారిత్రాత్మకమైన బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల ప్రాంతాన్ని అల్లూరి స్మారక పార్కుగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పితే అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధి అమలులో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కొయ్యూరు మండలం శరభన్నపాలెం ఎగువన దామనాపల్లి ఘాట్‌లో అల్లూరి సీతారామరాజు అనుచరులు మాటు వేసి బ్రిటీష్ సైనికాధికారులైన కల్నల్ నైవేలి హైటర్, స్కాట్ కవర్ట్‌లను కాల్చి చంపేశారు. బ్రిటీష్ ప్రభుత్వం హైటర్, కవర్ట్ మృతదేహాలను రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం తరలించి ఊరు శివార్లలో ఖననం చేసింది. గొలుగొండ సంస్థానంలో బ్రిటీష్ ప్రతినిధిగా పని చేస్తూ వయస్సు రీత్యా చనిపోయిన జేబ్స్ గిబ్సన్ మృతదేహాన్ని కూడా ఇక్కడే ఖననం చేశారు. సమాధులు ఉన్న 46 సెంట్లు స్థలాన్ని బ్రిటీష్ ప్రభుత్వం నిషిద్ధ భూమిగా ప్రకటించి పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంది. స్వాతంత్ర్యం అనంతరం సమాధులు చుట్టూ ఉన్న 10 సెంట్లు విస్తీర్ణం గల ఖాళీ స్థలాన్ని రెవెన్యూ అధికారులే పట్టాలు ఇచ్చేశారు. మెయిన్ రోడ్డుని ఆనకొని ఉన్న స్థలం కూడా కాలక్రమేణా చాలా వరకు ఆక్రమణకు గురైంది. ఇటీవల మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగించారు. రూ.కోట్లు విలువ చేసే సమాధుల స్థలం మళ్లీ ఆక్రమణ జరగకుండా చూడాలని, ఇప్పటికే ఉన్న ఆక్రమణలు తొలగించాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు డిమాండ్ చేస్తున్నారు. అల్లూరి స్మారక పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. చారిత్రాత్మక స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ కమిటీ ప్రతినిధి పీవీ సత్యనారాయణరావు కోరారు.


నర్సీపట్నంలోని హైటర్, కవర్ట్ సమాధులు

నేడు కృష్ణాదేవిపేటలో అల్లూరి విగ్రహావిష్కరణ


కృష్ణాదేవిపేట గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అల్లూరి ఫైబర్ విగ్రహం

కృష్ణాదేవిపేట, జూలై 3 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రం థాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన అల్లూరి నెలువెత్తు విగ్రహాన్ని గురువారం అల్లూరి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం స్థానిక గ్రంథాలయ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అల్లూరి నెలువెత్తు ఫైబర్ విగ్రహాన్ని ఎంపీ సుబ్బరాజు, దత్ల బుచ్చిరాజు ఆర్థిక సాయంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహాన్ని రాతి దిమ్మెపై ఉంచి టైల్స్ అమర్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై అల్లూరికి ఘన నివాళి అర్పించాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

మూడున్నర కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

కశింకోట, జూలై 3 : మండలంలోని నర్సింగబిల్లి శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంజాయి రవాణా చేస్తున్న విషయం బుధవారం వెలుగు చూసింది. ఈ ఇందుకు సంబంధించి ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలివి. రాజమహేంద్రవరం జిల్లాకు చెందిన వాసంశెట్టి రుద్ర వెంకటదుర్గా మహేష్, గంటి రెశ్వంత్ ఇరువురూ పాడేరులో గంజాయి కొనుగోలు చేసి విశాఖపట్నం నుంచి వయా అనకాపల్లి మీదుగా రాజమహేంద్రవరం తరలిస్తున్నారు.

ఇక్కడి నర్సింగబిల్లి జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ముందు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో వారి వాహనంలోని మూడున్నర కిలోల గంజాయి బయటపడింది. ఈ ఘటనలో గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

డ్రగ్స్, గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక

▸ ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి రవాణా, ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వంద రోజుల ప్రణాళిక అమలుపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర, ఒడిశా బోర్డర్‌తో పాటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. కేసుల విచారణపై దిశానిర్దేశం చేశారు. దర్యాప్తు అధికారులు గంజాయి కేసులను ప్రత్యేక శ్రద్ధతో నేరాభియోగ పత్రాలను సంబంధిత కోర్టుల్లో నమోదు చేయాలన్నారు. కేసుల్లో పురోగతిపై సమీక్షలు జరపాలని సూచించారు. ఈ సమావేశంలో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, జీఆర్ఆర్ మోహన్‌లతో పాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ


బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘం మహిళలు

రుణాలే తీసుకోలేదు.. తిరిగి చెల్లించాలా..?

▸ డ్వాక్రా సంఘాల మహిళలు ఆగ్రహం

▸ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ఆందోళన

కొత్తూరు, జూలై 3 : రుణాలు తీసుకోకుండానే తిరిగి చెల్లించాలని తమకు ఎలా నోటీసులు ఇస్తారని అనకాపల్లి మండలంలోని కొత్తూరు, ఎన్జీవో కాలనీకి చెందిన డ్వాక్రా సంఘ మహిళలు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దొడ్డి జానకి, కందుల అప్పల కొండ తదితరులు మాట్లాడుతూ తమకు యూనియన్ బ్యాంకులో అకౌంటు ఉందని, అది కూడా డ్వాక్రా పొదుపు సంఘంలో సభ్యులం కనుక అక్కడ అకౌంటు తెరిచామన్నారు. ఇదిలావుండగా, ఈ నెల ఒకటో బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.20 లక్షలు చెల్లించాలని నోటీసు వచ్చిందన్నారు. తమ పేర్లతో ఎవరో రుణం తీసుకొని ఉంటారని సదరు బ్యాంకుకు వెళ్లి అడగ్గా వాస్తవం బయటపడిందన్నారు. తమకు తెలియకుండా వీవోఏగా పనిచేస్తున్న నషీమా తమ సంతకాలు, ఆధార్ కార్డులు పెట్టి 2022లో రూ.20లక్షలు తీసుకున్నట్టు ఆరోపించారు. ఇదే విషయమై అనకాపల్లి పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని ఆ రుణానికి తమకు ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. తమను మోసగించడమే కాకుండా బ్యాంకును తప్పుదోవ పట్టించిన నషీమాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా తమ పేర్లపై రుణం రూపేణా తీసుకున్న నగదును ఆమె వద్ద నుంచే రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ అంశంపై బ్యాంకు చీఫ్ మేనేజర్ బి.శ్రీనివాసరావును వివరణ కోరగా, 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు 22 గ్రూపులకు అప్పటి బ్యాంకు మేనేజర్ రుణాలు మంజూరు చేశారన్నారు. తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత తీసుకున్న రుణాలు ఏ ఒక్కటీ రికవరీ కాకపోవడంతో 30 మంది డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపించానని తెలిపారు. దీంతో రుణాలు మంజూరులో అవకతవకలు బయటపడ్డాయన్నారు. ఈ విషయాలన్నింటినీ ఇప్పటికే ఏపీడీ దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. అధికారుల సమక్షంలో దొడ్డి జానకి, కందుల అప్పల కొండల పేరిట రుణం తీసుకోవడం వాస్తవమేనని నషీమా అంగీకరించారన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టాలని పోలీసులకు, డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తీసుకు వెళ్ళామని ఆయన వివరించారు.

పశువుల పాకల్లో దొంగలు పడ్డారు

▸ అపహరణకు గురైన పాడి ఆవులు, గేదెలు

▸ రోడ్లపై తిరిగే ఆవులను కూడా వదలని వైనం

▸ పోలీసులను ఆశ్రయించిన బాధితులు


చోడవరంలోని పశువుల పాక (ఫైల్)

చోడవరం, జూలై 3 : మండలంలో పాడి పశువుల దొంగతనాలు ఎక్కువయ్యాయి. పశువుల పాకల వద్ద ఉన్న పాడి గేదెలు, ఆవులను ఎత్తుకుపోవడంతో పాటు రోడ్లపై తిరిగే ఆవులను కూడా వదిలిపెట్టకుండా దొంగలు తరలించుకుపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 18న మండలంలోని గజపతినగరం పెద్దమదుము కళ్లాల వద్ద రైతులు శరడడం రామారావు, నరసింగరావులకు చెందిన రెండు పాడి జెర్సీ ఆవులను దొంగలు ఎత్తుకుపోయారు. పాకల వద్ద కట్టి ఉంచిన పాడి ఆవులను అర్ధరాత్రి పాకల నుంచి తరలించుకుపోయారు. అదే ప్రాంతంలో మరో రెండు పాడి ఆవులను కూడా దొంగలు తరలించుకు పోవడానికి విఫలయత్నం చేశారు. కాగా పట్టణ శివారు నరసయ్యపేటలోని ముగ్గురు రైతులకు చెందిన గేదెలు రెండురోజుల వ్యవధిలో చోరీకి గురయ్యాయి. పాకల వద్ద కట్టిన పశువులను దొంగలు తరలించుకు పోయారు. కాగా పట్టణంలోని బానయ్యకోనేరు ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే మహిళకు చెందిన ఆవు రోడ్డుపై ఉంటే, దానిని కూడా దొంగలు బలవంతంగా తోలుకుపోయారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నరసయ్యపేట ప్రాంతంలో పశువుల అపహరణకు సంబంధించి స్థానికుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. నలుగురైదుగురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి ఈ పశువుల దొంగతనాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి ఈ పశువుల దొంగతనాలకు కళ్లెం వేయడంతో పాటు ఎత్తుకుపోయిన పశువులను తిరిగి ఇప్పించవలసిందిగా పోలీసులను రైతులు కోరుతున్నారు.

అయోధ్యకు సైకిల్‌పై వెళ్లి మొక్కు తీర్చుకున్న పవన్ అభిమాని

బుచ్చెయ్యపేట, జూలై 3 : మండలంలోని పొట్టిదొరపాలేనికి చెందిన కొల్లిమళ్ల పెంటారావు డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ వీరాభిమాని. పెంటారావు పుట్టుకతోనే మూగ, చెవుడు.అయితే ఎన్నికల్లో పవన్ గెలిస్తే అయోధ్యకు సైకిల్‌పై వచ్చి దర్శించు కుంటానంటూ మొక్కుకున్నాడు. అతడు ఆశించినట్టేపవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో గెలవడమే కాకుండా డిప్యూటీ సీఎం కూడా కావడంతో పెంటారావు మొక్కు తీర్చేకునేందుకు జూన్ 21న సైకిల్‌పై ఇక్కడ నుంచి బయలుదేరాడు. బుధవారం అయోధ్య చేరుకొని బాల రాముడిని దర్శించుకొని మొక్కు తీర్చుకు న్నాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలకు తమ కుటుంబ సభ్యులు, పొట్టిదొరపాలెం లోని మిత్రులకు పంపి ఆనందం పంచుకున్నాడు.


సైకిల్‌పై అయోధ్య చేరుకున్న పవన్ అభిమాని పెంటారావు

సభాపతిని మర్యాదపూర్వకంగా కలిసిన డీపీవో

నర్సీపట్నం, జూలై 4 : శాసన సభాపతి అయ్యన్నపాత్రుడుని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరచాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.

అలాగే జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ సుగుణేశ్వరావు, ఆర్డీవో జయరాం, 108 ఉద్యోగులు, నాలుగు మండలాల టీడీపీ నాయకులు స్పీకర్‌ను కలిశారు.


సభాపతిని కలిసి మొక్క అందిస్తున్న డీపీవో శిరీషారాణి

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

▸ టీచ్ టూల్ శిక్షణ శిబిరంలో రాష్ట్ర పరిశీలకురాలు భాగ్యశ్రీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట, జూలై 3 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారిని కూడా ఉత్తములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్‌సీఆర్‌టీ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ జి.ఆర్.భాగ్యశ్రీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందేలా తమవంతు కృషి చేయాలన్నారు. శతశాతం సర్టిఫైడ్ అబ్జర్వర్‌గా ఉత్తీర్ణత సాధించాని కోరారు. బోధనాభ్యాసన సామగ్రిని విరివిగా వినియోగించాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు అనకాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, ఎస్.రాయవరం, కశింకోట, యలమంచిలి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు 120 మంది హాజరయ్యారు. ఏఎంవో ఎం.ఎం.పట్నాయక్, కోర్సు డైరెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఆర్.వి అప్పారావు, మాస్టర్ ట్రైనీలు నారాయణరావు, అచ్యుతకృష్ణ, నూకేష్, ఫణీంద్రకుమార్, వేణుగోపాల్, శ్రీరామమూర్తి, కశింకోట ఎంఈవో-2 మూర్తి, ఏపీవో వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ



మినుములూరు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సిబ్బంది కొరత తీర్చకపోతే ఆందోళన

పాడేరు రూరల్, జూలై 3: మినుములూరు పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది కొరతను తీర్చకుంటే ప్రజలతో కలిసి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ నేత ఎల్.సుందరరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. మినుములూరు పీహెచ్‌సీలో సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా సుందరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 36 మంది వైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా, కేవలం 16 మంది మాత్రమే ఉన్నారన్నారు. పీహెచ్‌వో, ఎంపీహెచ్‌వోలు లేరన్నారు. మినుములూరు, వంతాడపల్లి, గొండెలి ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఒక్క హెల్త్ అసిస్టెంట్ కూడా లేకపోవడం దారుణమని వాపోయారు. సిబ్బంది కొరతతో పనిభారానికి తోడు అధికారుల ఒత్తిడి, అదనపు క్షేత్రస్థాయి పర్యటనలు, ఆన్‌లైన్ వర్కులు పడడంతో మానసిక క్షోభకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ పీహెచ్‌సీ పరిధిలో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నా సిబ్బంది నియామకంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌సీ పరిధిలో పూర్తి స్థాయిలో క్షేత్ర సిబ్బందిని నియమించి ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకుడు శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని వినతి



సీఆర్‌టీ సమస్యలపై రాష్ట్ర విద్యా శాఖా మంత్రి లోకేశ్‌కు వినతి సంఘ నేతలు

కొయ్యూరు, జూలై 3: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ)ను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు బుధవారం అమరావతిలో కలసి వినతిని అందచేసినట్టు సీఆర్‌టీ సంఘ నేతలు తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథరావు, చిన్నయ్య ఆర్.శేఖర్‌బాబుతో కూడిన బృందం మంత్రిని కలిసినట్టు తెలిపారు. ఈ మేరకు మారుమూల కొండలపై గల ఆశ్రమ పాఠశాలల్లో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి విధులు నిర్వహిస్తున్నా గత ప్రభుత్వ హయాంలో అందరికీ న్యాయం జరగలేదని, కేవలం కొద్ది మందిని మాత్రమే రెగ్యులర్ చేసి మిగిలిన వారికి మెండిచెయ్యి చూపారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్టుగా తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

గోపీనాథ్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్సీ రఘువర్మ



గోపీనాథ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘువర్మ, ఉపాధ్యాయులు

చింతపల్లి, జూలై 3: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా గోపీనాథ్ అందించిన సేవలు అభినందనీయమని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ చెప్పారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందిన గోపీనాథ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా గోపీనాథ్ ఉత్తమ సేవలందించారన్నారు. ఎక్కడ పనిచేస్తే అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకుని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారన్నారు. నేటి తరం ఉపాధ్యాయులు గోపీనాథ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పనసల ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకులు జగన్మోహన్, బొడు గంగరాజు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధారాలమ్మను దర్శించుకున్న కలెక్టర్ దినేశ్‌కుమార్



సీలేరు, జూలై 3: ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువైన ధారాలమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. జిల్లాలోని చింతూరు డివిజన్ పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో గల ధారాలమ్మ ఆలయం వద్ద కలెక్టర్ ఆగి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటిసారిగా ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు ఆలయ అర్చకులు నారాయణమూర్తి తదితరులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాగడాలతో నిరసన



కాగడాలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న బూరిగ, చినకూనెల గిరిజనులు

అరకులోయ, జూలై 3: విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతగిరి మండలంలోని రొంపిల్లి పంచాయతీ బూరిగ, చినకూనెల గిరిజన గ్రామాల ప్రజలు బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కాలంలో మూడు కుటుంబాలకు చెందిన పశువులను పెద్దపులి బలి చేసిందని,పరిహారం విద్యుత్ సదుపాయం లేకపోవడంతో విషసర్పాల బారినపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సురక్షితమైన తాగునీరు లభించడం లేదని, వాగులే శరణ్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామాల్లో ఈ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.

ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి

అరకులోయ, జూలై 3: గిరిజన ప్రాంతంలో మారుమూల రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు అత్యవసర సేవలు అందిస్తున్న ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం కార్యదర్శి ఉమామహేశ్వరావు కోరారు. బుధవారం గిరిజన భవన్‌లో ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో రహదారులు లేని గ్రామాలకు తక్షణ వైద్య సేవలందించేందుకు ఫీడర్ అంబులెన్స్ అమలు చేశారన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 42 అంబులెన్స్‌లు ఉన్నట్టు ఆయన చెప్పారు. అతి తక్కువ వేతనాలతో ఎక్కువ పనిభారంతో డ్రైవర్లు పనులు చేయిస్తున్నారని వాపోయారు. మారుమూల రోడ్డు సౌకర్యం లేని గ్రామ ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించే ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్, శంకర్రావు పాల్గొన్నారు.

టంగళ్లగొంది రహదారి అధ్వానం

» వర్షాలతో కోతకు గురైన మార్గం.. వాహన చోదకులకు నరకం

గూడెంకొత్తవీధి, జూలై 3: మండలంలోని టంగళ్లగొంది రహదారి అధ్వానంగా తయారైంది. భారీ వర్షాలకు కొండల నుంచి నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో పలు చోట్ల తారురోడ్డు కొట్టుకుపోయింది. రెండేళ్ల క్రితం కంపుమానుపాకలు గ్రామం నుంచి టంగళ్లగొంది వరకు తారు రోడ్డు నిర్మించారు. అయితే రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించలేదు. దీంతో వర్షపు నీరు రహదారిపై నుంచి ప్రవహించడం వల్ల తారురోడ్డు కోతకు గురైంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోలకు సాగించేందుకు వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కోతకు గురైన రహదారికి తక్షణమే మరమ్మతులు చేయాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



తారు పెచ్చులు ఊడిపోయిన టంగళ్లగొంది రహదారి

గిరి బాలలకు నాణ్యమైన విద్యనందించాలి

జి.మాడుగుల, జూలై 3: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు ఉపాధ్యాయులకు ఆదేశించారు. మండలంలో కేజీబీవీ, గురుకుల పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, సదుపాయాలపై ఆరా తీశారు. నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కె.సత్యనారాయణ, ఎన్. మత్స్యకొండంనాయుడు, వి.సీతారాంనాయుడు, బి.బాలయ్యపడాల్, ఎస్.సోమలింగం, ఎస్.పండన్న, బంగార్రాజు ఉన్నారు.

ఆరోగ్య సూత్రాలతో వ్యాధులకు దూరం

ముంచంగిపుట్టు, జూలై 3: వర్షా కాలంలో ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులకు దూరం కావచ్చని కిలగాడ వైద్యాధికారి ఆర్.రమేష్ చెప్పారు. దారెల పంచాయతీ కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, వారు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిల్వ ఆహార పదార్థాలు తినరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తులసీ రత్నం, కాంతమ్మ, రాజేశ్వరి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

మత్స్యకారుడి వలకు 11 కిలోల చేప



సీలేరు, జూలై 3: సీలేరు రిజర్వాయర్‌లో మత్యకారుల వలకు భారీ చేపలు చిక్కాయి. బుధవారం నర్సింగ్ అనే మత్యకారుడి వలకు 11 కేజీల గెలస్కోప్ చేప పడింది. దీన్ని వాటాలు వేసి రూ.220 చొప్పున రూ.2420కు విక్రయించాడు. ఈ చేపను కొనుగోలు చేయడానికి వినియోగదారులు పోటీ పడ్డారు. అలాగే రెండు, మూడు కిలోల చేపలు కూడా మత్యకారుల వలకు చిక్కడంతో, వారికి మంచి ఆదాయం సమకూరింది.

గుమ్మిరేవుల రోడ్డులో కూలిన భారీ వృక్షం



దారకొండ-గుమ్మిరేవుల రోడ్డులో కూలిపోయిన వృక్షం

సీలేరు, జూలై 3: ధారకొండ-గుమ్మిరేవుల రహదారిలో కమ్మరితోట వద్ద భారీ వృక్షం కూలింది. మంగళవారం అర్ధ రాత్రి ఈదురుగాలులతో పడిన వానకు ఈ చెట్టు రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో ధారకొండ నుంచి గుమ్మిరేవుల పంచాయతీలోని పలు గ్రామాలతో పాటు పాతకోట, మారేడిమిల్లి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం నర్సీపట్నం-గుమ్మిరేవుల బస్సును ధారకొండలోనే ఆపేశారు. అధికారులు స్పందించి ఈ చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వైద్య శిబిరం

డుంబ్రిగుడ, జూలై 3: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు మలేరియా, సికిల్ ఎనీమియా పరీక్షలను చేశారు. పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ రాంబాబు చెప్పారు.

ఎఫ్‌పీవోల ప్రగతికి సహకారం

» గౌహతి జాయింట్ డైరెక్టర్ నవీన్‌కుమార్

చింతపల్లి, జూలై 3: రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీవో) ప్రగతికి కేంద్ర కాఫీ బోర్డు సాంకేతిక సహకారం అందిస్తుందని గౌహతి జాయింట్ డైరెక్టర్ (విస్తరణ) నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కాఫీ బోర్డు కార్యాలయంలో ఎఫ్‌పీవో ప్రతినిధులు, గిరిజన కాఫీ రైతులతో కాఫీ బోర్డు ఉన్నతాధికారుల బృందం సమావేశమయ్యారు. తొలుత గిరిజన కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి ఎఫ్‌పీవోలు పనిచేస్తున్న విధానాన్ని కేంద్ర కాఫీ బోర్డు ఉన్నతాధికారుల బృందం అడిగి తెలుసుకున్నది. ఈ సందర్భంగా గౌహతి జాయింట్ డైరెక్టర్(విస్తరణ) మాట్లాడుతూ రైతులు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేందుకు కేంద్ర కాఫీ బోర్డు ప్రత్యేక కృషి చేస్తున్నదన్నారు. ప్రధానంగా మొక్కలు నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు కాఫీ బోర్డు ఉద్యోగులు రైతులకు సాంకేతిక సహకారం అందిస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు కాఫీ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను తెలియజేస్తున్నట్టు చెప్పారు. నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేపట్టేందుకు రైతులు చేపట్టాల్సిన పద్ధతులు వివరిస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ కాఫీ ధరలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నామన్నారు. గిరిజన రైతులు కలిసి ఎఫ్‌పీవోగా ఏర్పడడం సంతోషకరమన్నారు. ఎఫ్‌పీవోలు ద్వారా గిరిజన రైతులు కొంత అధిక ధర పొందుతున్నట్టు తమకు సమాచారం ఉన్నదని తెలిపారు. అయితే ఎఫ్‌పీవోలు అధిక ధర అందించేందుకు చూపిస్తున్న శ్రద్ధతోపాటు నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలన్నారు. చుండల జాయింట్ డైరెక్టర్(విస్తరణ) డాక్టర్ ఎం.కరుతమణి మాట్లాడుతూ ఎఫ్‌పీవోలు గిరిజన రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పెంచగలిగితే మార్కెట్‌లో అధిక ధర పొందవచ్చునన్నారు. కాఫీ ఉత్పత్తిలోనూ నాణ్యత కోసం రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, పండ్ల సేకరణ, పార్చిమెంట్ తయారీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు శివ కుమారస్వామి, డాక్టర్ కె.శ్రీదేవి, వైబీ వెంకటరెడ్డి, ఎస్ఎల్‌వోలు శివరామ్, తంగరాజ, వెంకటరాజ్ మనోహరన్, అజిత్‌కుమార్ రౌట్, యప్పిహాజి, విశ్వనాథ్, ఇందిర, బసవరాజు, పాడేరు డీడీ ఎస్.రమేశ్, ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ ఎస్.అశోక్, చింతపల్లి జేఎల్‌వో ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండండి

» అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



చింతూరు ఐటీడీఏలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 3: వరదల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విలీన మండలాల్లోని ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. విలీన మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వరద పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగానే సురక్షిత ప్రాంతాలలో బఫర్ స్టాక్ ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలను నిర్ణయించుకొని ఆయా ప్రాంతాలలో తాగునీరు, వసతి ఏర్పాట్లను ముందుగానే చేయాలన్నారు. లాంచీలు, మరబోట్ల అవసరాన్ని ముందుగానే గుర్తించి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. వరద తగ్గాక తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా అవసరమైన జేసీబీలు, ట్రాక్టర్ల వివరాలను తనకు నివేదిక ద్వారా అందించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతిని అనుసరించి ప్రజలకు సమాచారం అందిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి, డీఎఫ్‌వో భవిత పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

పాడేరు రూరల్, జూలై 3: సౌత్ ఇండియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. తమిళనాడులో గత నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పి.బుజ్జిబాబు, జి.అశోక్, ఎం.రమణ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరు బుధవారం కళాశాలకు చేరుకోగా ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్‌తో పాటు అధ్యాపకులు సత్కరించి అభినందించారు. క్రీడారంగంలో ప్రతిభ కనపరిచే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి చెప్పారు.

విప్లవ జ్యోతి అల్లూరి

... 3వ పేజీ తరువాయి

వరకు రోడ్డు మార్గం నిర్మించే కాంట్రాక్టరుతో కుమ్మక్కై, గిరిజనులకు ఆరు అణాలకు బదులుగా రెండు అణాలు మాత్రమే చెల్లించేవాడు. ఎదురు ప్రశ్నించిన ఆదివాసీలను కొరడాలతో కొట్టించేవాడు. దీనిపై సీతారామరాజు అధికారులకు ఫిర్యాదు చేసినా బ్రిటీష్ పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తనపై ఫిర్యాదు చేశాడనే కోపంతో బాస్టియన్.. సీతారామరాజు గిరిజనులను కూడగట్టి విప్లవం తీసుకు వచ్చేందుకు సన్నాహాల్లో ఉన్నాడని బ్రిటీష్ ప్రభుత్వానికి లేఖ రాశాడు. దీంతో సీతారామరాజును కొన్నాళ్లు అడ్డతీగల సమీపం పైడిపుట్టిలో, నర్సీపట్నంలో అధికారుల కనుసన్నల్లో బ్రిటీష్ ప్రభుత్వం ఉంచింది. బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి ఫజలుల్లాఖాన్ సీతారామరాజును చాలా అభిమానించి సహాయం చేసేవాడు. దీంతో ఫజులుల్లాఖాన్‌కి తిరుగుబాటు చేయనని సీతారామరాజు మాట ఇచ్చాడు. ఈ మాటకు ఆయన కట్టుబడి ఉన్నాడు. 1922 జూలై 27న ఫజులుల్లాఖాన్ ఆకస్మికంగా మరణించాడు. దీంతో సీతారామరాజు ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టి గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండుపడాల్, సత్యనారాయణరాజు, అగ్గిరాజు, గోకిరి ఎర్రేసుతో సహా 150 మంది గిరిజనులను బ్రిటీష్ పాలకులపై పోరాటానికి సిద్ధం చేశాడు. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి సాయుధ పోరాటానికి సిద్ధపడి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి నిర్ణయం తీసుకున్నారు.

చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడితో సాయుధ పోరాటం

అల్లూరి సీతారామరాజు తన అనుచరులతో తొలిసారిగా 1922 ఆగస్టు 22న చింతపల్లిపై దాడి చేసి సాయుధ పోరాటానికి నాంది పలికాడు. స్టేషన్‌లో 11 తుపాకులు, 5 కత్తులు, 1,390 తుపాకీ గుళ్లు, 11 బాయినెట్లు స్వాధీనం చేసుకున్నారు. తాను స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను రికార్డులో నమోదు చేశాడు. అదే క్రమంలో 23వ తేదీన కృష్ణాదేవిపేట, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌లపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. సీతారామరాజు పోరాటంలో అత్యంత సాహసోపేతంగా అక్టోబర్ 15న అడ్డతీగల పోలీస్ స్టేషన్‌కు ముందుగా సమాచారం ఇచ్చి మరీ దాడి చేశారు. అదే నెల 19న రంపచోడవరం పోలీస్ స్టేషన్‌ను పట్టపగలే ముట్టడించి మొదటి దశ విప్లవానికి శ్రీకారం చుట్టారు. అదే ఏడాది డిసెంబర్ 6 నుంచి రెండోవ దశ ఉద్యమాన్ని ప్రారంభించిన సీతారామరాజు బ్రిటీష్ పాలకులను ముప్పతిప్పలు పెట్టాడు.

ఉద్యమం అణచివేతకు రూథర్‌ఫర్డ్ నియామకం

సీతారామరాజు ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17 మన్యానికి కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. అతనికి విప్లవాలను అణచివేయడంతో నిపుణుడిగా పేరుంది. ఆయన కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. ఈ విషయం తెలుసుకున్న సీతారామరాజు అదే ఏడాది మే 7న తాను ఉన్న ప్రాంతాన్ని పశువుల కాపరి ద్వారా పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింతచెట్టుకు కట్టి గుడాల్ కాల్చిచంపాడు. 8వ తేదీన సీతారామరాజు దేహాన్ని ఫొటో తీయించి కృష్ణాదేవిపేటలో దహనం చేశారు.

అల్లూరి నడయాడిన చోట పార్కు ఏర్పాటు

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నడయాడిన చోట స్మారక మందిరం(పార్కు)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అల్లూరితో పాటు గంటందొర సమాధులను నిర్మించి, గ్రానైట్ రాళ్లతో తాపడం చేశారు. పార్కు చుట్టూ ప్రహరీ గోడ, సమాధులున్న ప్రదేశంలో నీడ కోసం భవనం నిర్మించారు. ఆ స్మారక మందిరాన్ని నిత్యం ఎంతో మంది సందర్శిస్తుంటారు.

సంక్షిప్తంగా..

ఫైర్ ఆఫీసర్‌గా రమణ బాధ్యతలు



విధుల్లో చేరిన రమణ

పాడేరు రూరల్, జూలై 3: పాడేరు అగ్నిమాపక కేంద్ర అధికారిగా ఏవీ.రమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎలమంచిలి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమణను అధికారులు పాడేరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు అగ్నిమాపక కేంద్రంలో 1983లో ఫైర్‌మేన్‌గా పని చేశానని చెప్పారు. దీంతో ఈ ప్రాంతంపై అవగాహన ఉందని, విజయవంతంగా విధులు నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రిటైర్డ్ అధికారికి సత్కారం

పాడేరు అగ్నిమాపక కేంద్ర అధికారిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందిన కేపీ.నాయుడును స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఘనంగా సన్మానించారు. రెండేళ్ల పాటు పాడేరులో నాయుడు అందించిన సేవలను చిరస్మరణీయమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

740 మంది విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు

కొయ్యూరు, జూలై 3: మండలంలోని రావణాపల్లి, వైఎస్ పాకలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 740 మంది విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రుతి క్రమంలో వచ్చే ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ తదితర అంశాలపై రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మనోజ్ఞ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది మంగరాజు, పుష్పవల్లి, పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రైస్తవ దినోత్సవం

చింతపల్లి, జూన్ 3: మండల కేంద్రంలో జాతీయ క్రైస్తవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం షారోన్ బృందం, చింతపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్, యూసీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో క్రైస్తవులు, పాస్టర్లు హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు చర్చిల క్రైస్తవులు, పాస్టర్లు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవ దినోత్సవాన్ని నిర్వహించారు. అరకు చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ శాంతి విరజిల్లాలని, పాలకులు-అధికారులు మంచి పాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వి.ప్రభుదాస్, కె.ఎలీషా, కేఎస్.బాబూరావు, విజయడానియేల్ మోడీ, కె.సముయేలు, లూథరన్ మిషన్ ఫీల్డ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్, దైవ సేవకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి ఫ్లోరైడ్ సమస్య

కొయ్యూరు, జూలై 3: మండలంలోని కంఠారం, బాలారం గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యను కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు బీజేపీ మండల అధ్యక్షుడు అప్పలరాజు, సమాచార హక్కు చట్టం జిల్లా కోఆర్డినేటర్ అర్జునుడు తెలిపారు. అలాగే ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు పెంచాలని, సక్రమంగా వైద్య సేవలు అందేలా చూడాలని విన్నవించామన్నారు. గిరిజన ప్రాంతంలో పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసుల వివరాలను కూడా కలెక్టర్ ముందు ఉంచుతామని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరినట్టు చెప్పారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుకుంపేట, జూలై 3: మండల కేంద్రంలోని దాలిగుమ్మడి గ్రామంలో డ్రైనేజీ, బోరు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దాలిగుమ్మలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని, జడ్పీ నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టగా ఎన్నిక కోడ్‌తో నిలిపివేసినట్టు చెప్పారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాలక్రిష్ణ, ఎంపీటీసీ సభ్యులు కె.రమ, సర్పంచ్ పూర్ణిమ పాల్గొన్నారు

ఉపాధి కూలి చెల్లించరూ...

హుకుంపేట, జూలై 3: ఉపాధి పథకంలో చేసిన పనులు తక్షణమే కూలి చెల్లించాలని కూలీలు డిమాండ్ చేశారు. పనులు చేసి నెలలు తరబడుతున్నా డబ్బులు రాలేదని పలు గ్రామాల కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లల చదువుల కోసం అయ్యే ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తున్నదని వాపోయారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఉపాధి కూలి అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.

వరి సాగులో సస్యరక్షణ అవసరం

కొయ్యూరు, జూలై 3: వరి నారుమడులలో సస్యరక్షణ చర్యలతో సాగులో చీడపీడల నివారణ సులభమవుతుందని వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. శింగవరం గ్రామంలో వరినారు మడులను బుధవారం పరిశీలించి రైతులకు పలు సలహాలు ఇచ్చారు. ఐదు సెంట్ల ఆకుమడికి రెండు లేదా మూడు బస్తాల వరి ఊకను పెంటలో కలిపి వేస్తే ఆకుతీత సులభంగా ఉంటుందన్నారు. పది సెంట్ల ఆకుమడికి నాలుగు కిలోల యూరియా, ఎనిమిది కిలోల ఎస్ఎస్‌పీ, రెండు కిలోల పొటాష్ వేయాలని సూచించారు. విత్తనశుద్ధి చేస్తే అగ్గితెగులు నివారించవచ్చని ఏవో సూచించారు.

పాత్రికేయుడి మృతి

కొయ్యూరు, జూలై 3: మండలంలో 15 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న సాగిరాజు నగేష్ (48) బుధవారం ఉదయం గుండెపోటు బారినపడి మరణించాడు. ఎప్పటిలాగే ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమైన నగేష్, 11 గంటల సమయంలో గుండెపోటు వచ్చి రాజేంద్రపాలెంలో ఇంటి వద్దనే కుప్పకూలాడు. ఇది గుర్తించిన తల్లి లక్ష్మి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే ప్రయత్నం చేయగా తుదిశ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న మిగిలిన పాత్రికేయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు అధికారులు నగేష్ స్వగృహానికి వెళ్లి, అతని తల్లిని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.